అప్పన్న భూములు అన్యాక్రాంతం



కొండవాలు ప్రాంతంలో దేవస్థానం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- కొండవాలు స్థలాల్లో ప్రైవేటు వ్యాపారాలు
- 90వ వార్డు పరిధిలో ఆక్రమణల పర్వం
- యూజర్ చార్జీలు చెల్లిస్తున్నామంటున్న వ్యాపారులు
- ఆక్రమణదారులకు కూటమి నేతల అండ
- ఇటువైపు కన్నెత్తి చూడని దేవస్థానం అధికారులు

విశాఖ విద్య: సింహాచలం దేవస్థానం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. జీవీఎంసీ 90వ వార్డుకు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో పలు చోట్ల దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ అధికారులు చూసీ, చూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎన్‌ఏడీ సెంటర్‌కు కూతవేటు దూరంలో ఏపీ ఎస్ఈబీ, సీతారామరాజు నగర్ కాలనీలను ఆనుకొని ఉన్న దేవస్థానం స్థలానికి మంచి డిమాండ్ ఉంది. నివాసిత గృహాలు, అపార్ట్‌మెంట్‌లకు ఆనుకొని ఉండటంతో దీనిపై కొంతమంది కన్ను పడింది. అప్పన్న ఆలయ భూములు పరిరక్షణ కోసం నిత్యం పహారా కాసే అధికారులు, సెక్యూరిటీ సిబ్బందికి ఇక్కడ జరిగే ఆక్రమణలు కనిపించకపోవడంలో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పేదలపైనే ప్రతాపం

దేవస్థానానికి సంబంధించిన స్థలాన్ని ఎవ్వరూ ఆక్రమించడానికి వీల్లేదు. అయితే ఉండటానికి ఇళ్లు లేని వారు కొండవాలు ప్రాంతంలో తాత్కాలిక గూడు ఏర్పాటు చేసుకుంటే, క్షణాల్లో వాలిపోయి ఉన్నఫళంగా వాటిని తొలగించే అధికారులు, దేవస్థానం స్థలాన్నే వ్యాపారాలకు అడ్డాగా చేసుకునే వారి విషయంలో వెనుకడుగు వేస్తుండటాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. పేదలపై ప్రతాపం చూపించే అధికారులు వ్యాపారుల దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

షరా 'మామూళ్లే'నట

కొండవాలు ఏరియాలోని దేవస్థానం స్థలంలో ప్రైవేటు వ్యాపారాలు చేసుకునే వారికి కొంతమంది కూటమి నేతల అండదండలు ఉండటంతోనే అధికారులు చర్యలకు వెనుకంజ వేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇదే అదునుగా తీసుకున్న కొంతమంది పర్యవేక్షణ అధికారులు వ్యాపారుల నుంచి గట్టిగానే మామూళ్లు గుంజుతున్నట్లు తెలుస్తోంది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందాన దీనిలో కొంతమంది కూటమి నేతలకు సైతం వాటాలు చేరుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ 'ఇదంతా షరా మామూళ్లే' అని పరిసర కాలనీల ప్రజానీకం బాహాటంగానే అంటున్నారు. దేవస్థానం స్థలాల్లో ప్రైవేటు వ్యాపారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే, వీటి వెనుక ఉన్న వసూళ్ల రాయుళ్లు ఎవరనేది బహిర్గతమవుతుందని పలువురు అంటున్నారు.



దేవస్థానం స్థలంలో వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకున్న రోడ్డు

అధికారుల అండతోనే..!

ఎన్‌ఏడీ సెంటర్‌లోని ఎన్ఎస్‌టీఎల్ మొదలుకుని లక్ష్మీనగర్ మీదగా సింహాచలం ఆలయం రోడ్‌కు వెళ్లే దారి వరకు ఓ వైపున కొండ ఉంది. దీనికి అనుకొని కొండవాలు ఏరియాలో కొంతమంది విలువైన స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. వీటిలో వ్యాపారాలు చేసుకునే వారిలో దేవస్థానానికి చెందిన కొంతమంది అధికారుల అండదండలు కూడా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. ఏడాదికో సారి దేవస్థానానికి ఎంతో కొంత చెల్లించాలని, ఎవరైనా స్థలం వద్దకు వచ్చి ప్రశ్నిస్తే యూజర్ చార్జీలు కడుతున్నట్లు చెప్పండని దేవస్థానం అధికారులే ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

వ్యాపారాల కోసం దర్జాగా రోడ్ల నిర్మాణం

దేవస్థానం స్థలం నిషేధిత ప్రదేశమనే చెప్పాలి. ఏపీ ఎస్ఈబీ కాలనీకి ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో దేవస్థానం అధికారులు ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పలు చోట్ల హెచ్చరికల బోర్డులు పెట్టారు. అయితే సీతారామరాజునగర్ కాలనీని అనుకొని హెచ్చరికల బోర్డు పెట్టినా, పక్కనుంచే తమ వ్యాపారాల నిర్వహణ కోసమని దర్జాగా రోడ్డు ఏర్పాటు చేసుకోవటం గమనార్హం. సింహాచలం అప్పన్న ఆస్తులను పరిరక్షించేందుకని ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బందికి ఇవేమీ కనిపించటం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు ఇలాంటి ఆక్రమణలపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకొని అప్పన్న ఆస్తులను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

● అయితే, సీతారామరాజు నగర్ కాలనీ ఏరియాలో స్థలాన్ని కొంతమందికి లీజుకు ఇచ్చామని ఆలయ ల్యాండ్స్ విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

సీతారామరాజు నగర్ కాలనీకి ఆనుకొని ఉన్న దేవస్థానం భూముల్లో ఎవరి నుంచి యూజర్ చార్జీలను వసూలు చేయడం లేదు. ఆక్రమణలపై పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

– వర్మ రాజు, ఏఈవో, సింహాచలం దేవస్థానం

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కోస్టల్ బ్యాంకు సీఈవో హేమంత్ కుమార్



బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హేమంత్ కుమార్

విశాఖ విద్య: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్టు కోస్టల్ బ్యాంకు చీఫ్ ఆపరేటింగ్ అధికారి పి.హేమంత్ కుమార్ అన్నారు. ఎన్‌ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెంలో కోస్టల్ బ్యాంకు గోపాలపట్నం బ్రాంచి కార్యకలాపాలను విశాలమైన భవనంలోకి మార్పు చేశారు. దీనిని బుధవారం ఆయన ప్రారంభించారు. బ్రాంచిలో ఖాతాదారుల సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తున్నందున వల్లే బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలు పురోగమిస్తున్నాయన్నారు. తక్కువ వడ్డీకే రుణాలు సకాలంలో ఇవ్వడంతో పాటు, డిపాజిట్ దారులకు లాభదాయకమైన వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యూపీఐ సేవలు విస్తరిస్తున్నామని, వీటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ యు. తులసీరావు, క్లస్టర్ హెడ్ వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నైట్ షెల్టర్ ఆధునికీకరణకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలోని నిరాశ్రయుల షెల్టర్‌లో ఆధునికీకరణ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. నైట్ షెల్టర్ భవనం మరమ్మతుల కోసం జీవీఎంసీ రూ.11.10 లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నిధులతో షెల్టర్‌లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత, టీడీపీ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నరవ పైడిరాజు, జీవీఎంసీ ఏఈ రామకృష్ణ, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- డిప్యూటీ మేయర్ శ్రీధర్



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న శ్రీధర్, అధికారులు

విశాఖ విద్య: 52వ వార్డు కరాస హిందూ – ముస్లిం – క్రైస్తవ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. కరాస శ్మశాన వాటికలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. శ్మశాన వాటికల్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడే విధంగా పచ్చని మెక్కలు, సుందరమైన పెయింటింగ్స్ తో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆ ప్రణాళికను ఆయా మతపెద్దలకు వివరించారు. అనంతరం వారి నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఉషారాణి , వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, సచివాలయం ఉద్యోగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప చరిత్రకారుడు గద్దర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప చరిత్రకారుడు గద్దర్ అని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గద్దర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, బహుజనుల కోసం తన జీవితాంతం సాహిత్య సేవ చేశారని గుర్తు చేశారు. తన పాటతో, గళంతో ప్రభుత్వాలని కడవరకు ప్రశ్నించారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఒ.జాన్ మాట్లాడుతూ ఈ నెల 20న ఉదయం 10 గంటలకు టీఎల్ఎన్ సమావేశ మందిరంలోను, మధ్యాహ్నం 2 గంటలకు పౌర గ్రంథాలయంలో గద్దర్ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు రీసెర్చ్ స్కాలర్స్, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ప్రేమానందం, జర్ర అప్పారావు, పాటల తూట ఉదయభాస్కర్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, అంబేద్కర్, ఆరేటి మహేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ ఎంప్లాయీస్ (టీచర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారన్ రాజు, మోహన్, జై భీమ్ ప్రకాష్, రాయ్, రమణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అదనపు గదులు, సైన్స్ ల్యాబ్ ప్రారంభం

మల్కాపురం: 58వ వార్డు శ్రీహరిపురం వద్ద గల జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభానికి నోచుకున్నాయి. పాఠశాలలో రెండు అదనపు గదులు, ఒక సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ సుమారు రూ.28 లక్షల తన సీఎస్ఆర్ నిధులు సమకూర్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ చేతుల మీదగా నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది జూన్ నాటికి 90 శాతం పనులు పూర్తి అయ్యాయి.కొత్త ప్రభుత్వం రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు అదనపు గదులు ప్రారంభానికి నోచుకున్నాయి. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో తమ ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ అధికారులు జ్ఞానసుందరం, ఆర్.శ్రీనివాస్‌రావు, జైగోపాల్,శ్రీకాంత్‌లతో పాటు వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను,మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి,తెలుగు యువత నాయకులు రామ్మోహన్‌నాయుడు, పొత్తబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, కోరమాండల్ అధికారులు

పాఠశాలలు తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రామారావు

విశాఖ విద్య: మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసే క్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు బుధవారం నగరంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని కేడీపీఎం ఉన్నత పాఠశాల, ఎంవీపీలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం రుచి ఎలా ఉందనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎం పోషణ్ కమిటీ సభ్యుడిగా ఇక నుంచి పాఠశాలల్లో అమలయ్యే భోజనం పథకం తీరును ఆకస్మికంగా పరిశీలించినట్టు చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బీజేపీలో చేరికలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీకి చెందిన మేఘన దుర్గతో పాటు కాలనీకి చెందిన సుమారు 10 మంది మహిళా కార్యకర్తలు బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సమక్షంలో వారు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మేఘన దుర్గను వార్డు బీజేపీ అధ్యక్షురాలిగా నియమిస్తున్నట్లు రవీంద్ర ప్రకటించారు. కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



అబ్దుల్‌కలాం జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: ప్రతి విద్యార్థి తన కల నెరవేరే వరకు శ్రమించాలని,అబ్దుల్ కలాం వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు.మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తకాలను శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక : రాష్ట్రంలో నిత్యావసర సరకుల ధరలు దారుణంగా పెరిగిపోతున్నాయని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో మంగళవారం ఆందోళన చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త గాజువాక మార్కెట్‌వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలను కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కంది పప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, టమాటా ధరలతోపాటు కూరగాయల ధరలు మండిపోతున్నాయని తెలిపారు. పెరిగిపోతున్న ధరలతో మధ్య తరగతి, పేద ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. నిత్యావసర సరుకులను రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ డిపోలద్వారా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, కె.అచ్యుతరావు, ఎ.విష్ణు, పి.దుర్గారావు, కె.వనజాక్షి, పి.పద్మ, పప్పు అప్పారావు, ఎం.అప్పారావు, మురళి, శేఖర్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

యూపీహెచ్‌సీలో సేవలపై ఆరా

సీతమ్మధార: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రేసపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని, సరకుల నిల్వలను పరిశీలించారు. పిల్లల నేమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. వారితో సరదాగా గడిపారు. తనిఖీలో భాగంగా నిర్వాహకులతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. నెలవారీ సరకులు, టీహెచ్‌ఆర్, కేంద్రానికి వస్తున్న చిన్నారులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. లోపాలు తలెత్తకుండా సరకులు అందజేయాలని, చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అక్కడి వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి, ఆయా వున్నారు.



యూపీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి..

ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం సేవలందించాలని, సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. పాత రేసపువానిపాలెంలోని యూపీహెచ్‌సీని మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఓపీ సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడికి విచ్చేసిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల హాజరు పుస్తకాలు, ఇతర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి మన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావంలో అమృతరావు పాత్ర మరువరానిది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావంలో దివంగత టి.అమృతరావు పాత్ర మరువరానిదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం అమృతరావు విశాఖ కలెక్టరేట్ దగ్గర అమరణ నిరాహార దీక్ష చేసి నేటికి 59 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విశాఖలో కాకుండా కర్ణాటకకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో అమృతరావు గుంటూరు నుంచి విశాఖ వచ్చి తన ప్రాణాలకు తెగించి అమరణ దీక్ష చేశారన్నారు. ఆయన దీక్ష వల్ల రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారి 32 మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆయన దీక్షకు దిగి వచ్చి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖ వచ్చి ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారన్నారు. ఆయనను స్మరించుకోవడం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, నరేంద్ర, సుదర్శనం, ఎల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అమృతరావుకు నివాళి అర్పిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ముగిసిన స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైన స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అక్టోబరు 1వ తేదీన స్వచ్ఛతా ప్రతిజ్ఞతో ప్రారంభించబడిన ఈ పక్షోత్సవాలలో భాగంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను డివిజన్ పరిధిలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛతా కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ దీనిని ఆచరించినపుడు దేశాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని తెలిపారు. భారతదేశ ప్రగతికి జీవనాడి అయిన భారతీయ రైల్వే భారతదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తన వంతు కృషి చేస్తుందని తెలిపారు. పక్షోత్సవాలలో భాగంగా డివిజన్ పరిధిలో గల ఆయా రైల్వే స్టేషన్లు, రైళ్లు, రైల్వే కాలనీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం నేతృత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ బృందం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ వింగ్‌ల సహకారంతో అవగాహన కార్యక్రమాలు, లఘు నాటికలు, ఫ్లాష్ మాబ్స్, ర్యాలీల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం గురించి అవగాహన కల్పించి ప్రత్యేక డ్రైవ్ ద్వారా 550 కేజీల ప్లాస్టిక్ బ్యాగ్స్, బాటిళ్ల వంటి ప్లాస్టిక్ వేస్ట్‌ను సేకరించారు. డివిజన్ పరిధిలో గల ప్రయాణికులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వీటిని అతిక్రమించిన వారిపై ఈ పక్షోత్సవాలలో 1356 కేసులు నమోదు చేసి, రూ. 3 లక్షల జరిమానా విధించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఆర్‌ఎం, ఇతర అధికారులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న స్టేషన్ అధికారులు

పురాతన వస్తువుల ప్రదర్శనకు ప్రశంసలు



పురాతన నాణాల గురించి వివరిస్తున్న శివప్రకాష్

మద్దిలపాలెం: నగరానికి చెందిన సహకార బ్యాంకు విశ్రాంత ఉద్యోగి జీఎస్ శివప్రకాష్‌కు పురాతన వస్తువులు, నాణాలు, స్టాంపులు సేకరణలో దిట్ట. వివిధ జిల్లాలలో తరచూ ప్రదర్శనలు వచ్చి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు. ఈ క్రమంలో విజయనగరం పైడితల్లమ్మ అమ్మవారి ఉత్సవంలో ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేద్ మాధవన్ ఆదేశానుసారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం ఉత్సవాల్లో శివప్రకాష్ పురాతన నాణేలు, వస్తువులను ప్రదర్శించారు.పలువురు ప్రముఖులు తిలకించి శివప్రకాష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మంగళవారం గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎ. శివనారాయణ సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒడిషా రాష్ట్రం, కోరాపుట్‌కు చెందిన త్రినాథ్ సీసా, అరుణ్ కంబార్‌ల లగేజీలను తనిఖీ చేయగా సుమారు రూ. 36,250 విలువైన 7.250 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, సదరు వ్యక్తులను జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.